సాక్షి సిద్దిపేట

సోమవారం । 30 । సెప్టెంబర్ । 2024



పత్తి రైతును ముంచిన వర్షాలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట భారీగా దెబ్బతింది. దీంతో రైతులు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి. వివరాలు 8లో ▸



అధిగమిస్తే సువర్ణావకాశం

డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగ అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం జాబ్ గ్యారంటీ కోర్సులను ప్రవేశపెట్టింది. వివరాలు 8లో ▸



నీటి తరలింపు నిలిపివేయండి

తపాసుపల్లి రిజర్వాయర్ నుంచి నీటి తరలింపు నిలిపి వేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి అన్నారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ క్రీడాకారుల ఎంపిక సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ సౌందర్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని మినీ స్టేడియంలో జరిగే అండర్ 14, 17 విభాగాల్లో హ్యాండ్‌బాల్ క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9గంటలకు బోనఫైడ్‌తో హాజరుకావాలన్నారు.

సిటీ పోలీస్ యాక్టు అమలు

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో సోమవారం నుంచి సిటీ పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ తెలిపారు. ఈ నిబంధనలు వచ్చే నెల 15వ తేదీ వరకు అమల్లో ఉంటాయన్నారు. పోలీసుల ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అదేవిధంగా సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా పొడిగిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఎన్‌సీసీతోనే క్రమశిక్షణ

గజ్వేల్‌రూరల్: ఎన్‌సీసీతోనే క్రమశిక్షణ అలవడుతుందని 33వ తెలంగాణ బెటాలియన్ సంగారెడ్డి కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రమేశ్ అన్నారు. బాలుర ఎడ్యుకేషన్‌హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న ఎన్‌సీసీ–సీఏటీసీ–5వ క్యాంపులో భాగంగా ఆదివారం ఎన్‌సీసీ క్యాడెట్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాంపు ద్వారా సైనిక వ్యవస్థ విధానం తెలియజేయడంతో పాటు విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించే అవకాశం ఉందన్నారు. ఈ క్యాంపు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎంఎస్‌రావ్, సుబేదార్ మేజర్ రామ్‌హరి పాల్గొన్నారు.


ముగిసిన అటవీశాఖ క్రీడలు




బహుమతులు అందజేస్తున్న డీఎఫ్‌ఓ శ్రీనివాస్

సిద్దిపేటజోన్: రెండు రోజుల పాటు కొనసాగుతున్న అటవీశాఖ ఉద్యోగుల క్రీడలు ఆదివారం ముగిశాయి. స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లోని అటవీశాఖ ఉద్యోగులు జోనల్ స్థాయి క్రీడలు ఆడారు. 406 పాయింట్లతో సిద్దిపేట జిల్లా, మెదక్ జిల్లా జట్లు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాయి. వీరికి డీఎఫ్‌ఓ శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి, కరీంనగర్ డీఎఫ్‌ఓలు నిఖిత, బాలమణి పాల్గొన్నారు.


ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ చందర్



డాక్టర్ చందర్



ఏ. భాస్కర్



వెనిశెట్టి గణేశ్

సిద్దిపేటకమాన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సిద్దిపేట శాఖ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ చందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఏ.భాస్కర్, జనరల్ సెక్రటరీగా వెనిశెట్టి గణేశ్, జాయింట్ సెక్రటరీలుగా అరుణ్‌సంతోష్, బాబు, ట్రెజరర్‌గా ప్రణీత్‌కుమార్, స్టేట్ కౌన్సిల్ మెంబర్స్‌గా సతీష్, శ్రీనివాస్, రామ్మోహన్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్లు ఆనంద్‌రాజ్, వేణుగోపాల్‌చారి, సంపత్, వీరన్న, శ్రవణ్‌కుమార్, సురేష్‌రెడ్డి, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్స్‌గా శివరామచారి, దుర్గారెడ్డి, సలహాదారులుగా చంద్రారెడ్డి, తిరుమల్‌రావు, రామచంద్రరావులను నియమితులయ్యారు.

'కార్పొరేట్'ల కొమ్ముకాస్తున్న మోదీ

సీపీఎం జిల్లా కార్యదర్శి ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: ప్రజలపై ధరల భారం పెంచి కార్పొరేట్ సంస్థలకు ప్రధాని మోదీ కొమ్ముకాస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు దర బ్యారెల్‌కు 70డాలర్‌లు తగ్గినా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం లేదని విమర్శించారు. ప్రజల పక్షాన సీపీఎం పనిచేస్తోందని, ప్రధాని మోదీ మాత్రం కార్పొరేట్ సంస్థల కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు.

బతుకమ్మ పండుగొచ్చే.. బంతి పూలు చేతికొచ్చే..

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇక ఊరూరా పూల పండుగే.. పూల సాగు కూడా ఆశాజనకంగా ఉంది. చాలా చోట్ల బంతి పూలు చేతికొచ్చాయి. సీజన్ బట్టి రైతులు తమ భూమిలో కొంత మేర పూలను సాగు చేస్తుంటారు. జగదేవ్‌పూర్ మండలం బస్వాపూర్, అంతాయిగూడ గ్రామాల్లో ప్రతి ఏటా రైతులు బంతిపూలు, పట్టుగొలుసు పూలను సాగు చేస్తున్నారు. పై గ్రామాల్లో 20 ఎకరాలకు పైగా పూల సాగు అవుతోంది. పెట్టుబడి తక్కువ లాభాలు ఎక్కువ కావడంతో పూల సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. బంతి పూలకు కిలో రూ.50 నుంచి రూ.వంద వరకు ఉంటోంది. పట్టుగొలుసు పూలకు రూ.80 నుంచి రూ.రెండు వందల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. బతుకమ్మ పండుగ నుంచి దీపావళి వరకు పూలకు గిరాకీ ఉంటోందని తెలిపారు.



బస్వాపూర్‌లో పూల సాగు..

పచ్చని భూములు లాక్కున్నారు.. రోడ్డుపాలు చేశారు

నేటికీ అందని పరిహారం

- భూనిర్వాసితుల ఆందోళన బాట
- పరిశ్రమల వద్ద నిలిచిన పనులు
- వర్గల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ వ్యవహారం



ఆదివారం పరిశ్రమ ప్రాంతంలో రోడ్డుపై భూ నిర్వాసితుల ఆందోళన

ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పేరిట సిరులు పండించే పంట పొలాలను లాక్కున్నారు. ఇష్టారీతి చెల్లింపులతో పరిహారం పరిహాసంగా మార్చేశారు. ఎక్కువ భూమికి తక్కువ పరిహారం ఇచ్చారు. కొందరికి నిరాకరించారు. ఇవిగో ప్లాట్లు అంటూ కొందరికే దస్త్రాలు ఇచ్చారు. అవి ఎక్కడ ఉన్నాయో పొజిషన్ చూపలేదు. మరికొందరికి అవి కూడా ఇవ్వలేదు. హామీలను పూర్తిస్థాయిలో అమలుచేయకుండా రోడ్డు పాల్జేసిందని వర్గల్ భూనిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు పూర్తిస్థాయి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన బాట పట్టారు. వారం రోజులుగా పరిశ్రమల ప్రాంతంలో రోడ్డుపై బైఠాయించి నిరసన గళం వినిపిస్తున్నారు. తమకు న్యాయం జరిగేంతవరకు ఆందోళన ఆపబోమని పేర్కొంటున్నారు.

– వర్గల్(గజ్వేల్)

వర్గల్ మండల కేంద్రంలో నాలుగేళ్ల క్రితం ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్ ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం వర్గల్‌లోని ప్రభుత్వ అసైన్‌మెంట్ భూములపై దృష్టి సారించింది. 992 మంది రైతుల నుంచి 845, 1209, 1266, 1495, 1510 సర్వేనెంబర్లలోని 783.04 ఎకరాల ప్రభుత్వ అసైన్‌మెంట్ భూమిని ప్రభుత్వం సేకరించింది. ఇందులో నవోదయ వద్ద 40 ఎకరాల భూమిని భూనిర్వాసితులకు ఇండ్లస్థలాల లేఅవుట్ కోసం కేటాయించారు. ఆ తరువాత పరిహారం చెల్లింపు కోసం రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. సేకరించిన భూమిని టీజీఐఐసీకి అప్పగించారు.

ఎకరానికి రూ.10 లక్షల పరిహారం

ఫుడ్‌ప్రాసెసింగ్ జోన్‌లో భూనిర్వాసితులకు ఎకరానికి రూ.10 లక్షల పరిహారంతో పాటు ఎక్కువ విస్తీర్ణం కోల్పోయిన రైతులకు 250 చదరపు గజాల (ఇంటి స్థలం) ప్లాటు, తక్కువ విస్తీర్ణం రైతులకు 120 చదరపు గజాల ప్లాటు ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. టీజీఐఐసీ అధికారులు భూనిర్వాసితుల కోసం 40 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ చేశారు. ప్లాటింగ్ చేసి, రోడ్లు వేసి వదిలేశారు. అధికారులు తెలిపిన సమాచారం ప్రకారం 373 మంది భూనిర్వాసితులకు ఒక్కొక్కరికి 250 చదరపు గజాల ప్లాట్లు, 108 మందికి 120 చదరపు గజాల ప్లాట్ల దస్త్రాలు పంపిణీ చేశారు. వారికి ఇంత వరకు పొజిషన్ ఇవ్వకపోవడంతో లేఅవుట్ ప్లాటింగ్ ప్రాంతమంతా పిచ్చిమొక్కలతో నిండిపోయింది.

ఓ వైపు సాగు.. మరోవైపు నిర్మాణాలు

టీజీఐఐసీ పరిశ్రమల కోసం కేటాయించిన భూమిలో పలురోడ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్, విద్యుత్‌లైన్ల నిర్మాణం జరిపింది. ఐదు, ఆరు దాకా పరిశ్రమల నిర్మాణాలు జరుగుతున్నాయి. మరోవైపు పరిహారం అందలేదని ఆరోపిస్తున్న రైతులు పరిశ్రమల ప్రాంతంలోని భూములలో వరి, పత్తి తదితర పంటలు సాగుచేసుకుంటున్నారు.



పరిశ్రమ ప్రాంతంలో సాగుచేసిన పత్తిచేను

పరిహారం అరకొర..

భూసేకరణ జరిపిన గత ప్రభుత్వం అరకొర పరిహారంతో చేతులు దులుపుకుందన్నది భూనిర్వాసితుల ప్రధాన ఆరోపణ. భూమికి తగినంత పరిహారమివ్వలేదని, ఏవో కారణాలతో కోత విధించారని ఆరోపిస్తున్నారు. పరిహారం చెల్లింపులోనూ, ఇళ్ల స్థలాల విషయంలోనూ అవకతవకలు జరిగాయని పేర్కొంటున్నారు. సమగ్రసర్వే జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పటి దాకా తమ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడంలేదు



ఎవుసం చేసుకుంట బతికెటోళ్లం. మా భూమి అంతా కంపెనీల కోసం తీసుకున్నారు. ఇంత వరకు పరిహారం ఇవ్వడం లేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. పట్టించుకున్నోళ్లు లేరు. మాకు పరిహారం, ప్లాటు ఇప్పించి న్యాయం చేయాలె.

– తపుటి శోభ

ఇంత వరకు పైస ఇవ్వలే..



పరిశ్రమల కోసం 2.10 ఎకరాల భూమి పోయింది. ఇంతవరకు పైస పరిహారమియ్యలేదు. తహసీల్దార్ దగ్గరికి వెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడంలేదు. చేసేదిలేక నా భూమిని నేనే సాగుచేసుకుంటున్న. పరిహారం ఇవ్వకుండా భూని ఎలా తీసుకుంటారు.

– కుమ్మరి నర్సింలు, రైతు

ఉన్నతాధికారులకు నివేదిస్తా



గతంలోనే ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ కోసం వర్గల్‌లో 992 మంది రైతుల నుంచి 783.04 ఎకరాల భూమి సేకరణ జరిగింది. ఎకరానికి రూ.10 లక్షల చొప్పున పరిహారమిచ్చారు. 481 ప్లాట్లకు దస్త్రాలు ఇచ్చారు. మరో 172 ప్లాట్ల కోసం ప్రతిపాదించారు. భూనిర్వాసిత వర్గల్ రైతుల డిమాండ్లను ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– బాల్‌రాజు (వర్గల్ తహశీల్దార్)

రైతు సంఘాలతో ఎంతో మేలు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రైతులు సంఘాలుగా ఏర్పడి ఐక్యంగా ఉంటే ఎంతో మేలు కలుగుతుందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగపురిలో కేంద్ర ప్రభుత్వ, ఎస్ఎఫ్ఏసీ, ఏకలవ్య ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటైన నాగపురి రైతు సేవా ఉత్పత్తిదారుల సంస్థ లిమిటెడ్ 3వ మహాసభ జక్కుల తిరుపతి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు సంఘటితమై అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, యంత్ర పరికరాలను రైతు సంఘాల ద్వారా కొనుగోలు చేస్తే తక్కువ ధరకే లభించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే పండించిన పంటలను ప్రాసెసింగ్ చేసి మార్కెట్లో ఎక్కువ ధరకు అమ్ముకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ఎఫ్‌పీఓలకు ఇస్తున్న రూ.15లక్షల ఈక్విటీ గ్రాంటును పొందేందుకు సభ్యులందరూ కృషి చేయాలన్నారు. మండల పరిధిలో మరి కొన్ని గ్రామాల రైతులను సంఘంలో చేర్చి మరింత అభివృద్ధి చెందుతూ జిల్లాకి పేరు తేవాలని సూచించారు. సంస్థ అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘంలో నాగపురి, పెద్దరాజుపేట, శభాష్‌గూడెం, పోతిరెడ్డిపల్లి, చుంచునకోట గ్రామాలకు చెందిన 761 మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1కోటి 43లక్షల టర్నోవర్ చేయగా రూ.5 లక్షల 4వేల లాభం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టీ రిటైర్డ్ జిల్లా వ్యవసాయ అధికారి అమరేష్, ట్రస్టీ కాశీనాథ్, ఏఓ భోగేష్, మాజీ సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పక్షమే..

- పీఆర్టీయూ 53 ఏళ్లుగా పోరాటం
- ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి

సిద్దిపేటజోన్: ఉమ్మడి రాష్ట్రంలోనూ, ప్రస్తుతం తెలంగాణలోనూ ఉపాధ్యాయుల పక్షాన నిలిచిన సంఘం పీఆర్టీయూనే అని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి అన్నారు. స్థానిక కొండ మల్లయ్య గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన జిల్లా పీఆర్టీయూ సర్వసభ్య సమావేశం, నూతన జిల్లా కమిటీ ఎంపిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 53 యేళ్లుగా ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలపై పనిచేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. సీఎంను ఒప్పించి 20 పదోన్నతులు, 35వేల ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరిగేలా చూసినట్టు చెప్పారు. త్వరలో దసరాకు రెండు డీఏలు ఇస్తామని సీఎం ఒప్పుకున్నారని తెలిపారు. భవిష్యత్‌లో రూ.200కోట్లతో విద్యార్థులకు సీఎం రేవంత్‌రెడ్డి పేరిట కిట్స్ రానున్నాయని చెప్పారు. నాలుగు రకాల డ్రెస్‌లు, 24రకాల వస్తువులతో ఈ కిట్స్ ఉంటాయని చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా నూతన అధ్యక్షుడిగా ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శిగా శశిధర్ శర్మతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. వారితో ఎమ్మెల్సీ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంఈఓలుగా పదోన్నతులు పొందిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో శుభాకర్‌రెడ్డి, అసలక్ష్మణ్, సిరిగాది బొందెయ్య, సిద్దేశ్వర్‌తోపాటు జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐడియా అదుర్స్



పంటను కాపాడుకోవడానికి ఏర్పాటు చేసిన దిష్టి బొమ్మ, పక్కనే కాపలా ఉన్న పెంపుడు కుక్క

మిరుదొడ్డి(దుబ్బాక): పశువులు, పందులు, కోతుల నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు తమకు వచ్చిన ఆలోచనలకు పదును పెడుతున్నారు. పంటల చుట్టూ వలలు, చీరలు, దిష్టిబొమ్మలతోపాటు పెంపుడు కుక్కలను సైతం కాపలా పెడుతున్నారు. పంటలను కాపాడుకోవడానికి చేసిన ఈ ఆలోచన సత్ఫలితాలను ఇస్తోందంటూ మిరుదొడ్డిలోని రైతులు చెబుతున్నారు.

విజయవాడకు గరుడ బస్సులు

పటాన్‌చెరు టౌన్: బీహెచ్ఈఎల్ రామచంద్రాపురం నుంచి విజయవాడకు రెండు గరుడ బస్సులు నడుపుతున్నట్లు బీహెచ్ఈఎల్ డిపో మేనేజర్ సుధ తెలిపారు. రామచంద్రాపురం, బీరంగూడ, చందానగర్, మియాపూర్, నిజాంపేట క్రాస్‌రోడ్డు మీదుగా ఓఆర్ఆర్ నుంచి బస్సు విజయవాడ వెళ్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మల్లన్న ఆలయంలో భక్తుల సందడి



స్వామివారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాకతో ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. భక్తులు పుష్కరిణిలో స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. గంగిరేణు చెట్టు ప్రాంగణంలో పట్నాలు, బోనాలు, ముడుపులు కట్టి మొక్కులు చెల్లించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బాలాజీ, ఏఈఓ శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్‌లు పర్యవేక్షించారు.

పనులు త్వరగా పూర్తి చేయండి: ఈఈ

కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో రూ.12కోట్లతో నిర్మాణం చేపడుతున్న క్యూ కాంప్లెక్స్ పనులను త్వరగా పూర్తిచేయాలని దేవాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆలయ ఈఓ బాలజీతో కలసి ఆదివారం ఆయన పనులను పరిశీలించారు. పలు సూచన లు సలహాలు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ స్వామివారి బ్రహ్మోత్సవాలు జనవరి నుంచి ప్రారంభం కానున్నాయని అప్పటిలోగా పనులు పూర్తి చేయాల న్నారు.



పనులను పరిశీలిస్తున్న దుర్గాప్రసాద్

మరసం గొప్ప సాహిత్య కోవెల

- కవులు ప్రతిపక్ష పాత్ర పోషించాలి
- మరసం వార్షికోత్సవ సభలో వక్తలు



మరసం జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్సీ దేశపతి, నందిని సిద్దారెడ్డి, సాహిత్యకారులు

సిద్దిపేటజోన్: మంజీర రచయితల సంఘం (మరసం) గొప్ప సాహిత్య కోవెల అని, ఎందరో గొప్ప వారు మరసం నుంచి నేర్చుకుని వచ్చిన వారేనని వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక విపంచి ఆడిటోరియం(గద్దర్ ప్రాంగణం)లో మరసం 38వ వార్షికోత్సవ సభ నిర్వహించారు .ఈ సందర్భంగా ప్రముఖ గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. దాశరథి మంజీర నవ్వడుల పదం నుంచి మరసం పుట్టుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. మంజీర ఆధారంగా మరసం ఏర్పడిందని అన్నారు. దాశరథి గొప్ప తనం గూర్చి వివరించారు. అనంతరం ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ.. మరసం ఎందరికో సాహిత్య పరిచయం చేసిందన్నారు. పాఠ్య ప్రణాళికలో భాగం కానీ సాహిత్యం కూడా ఉందన్నారు. సమాజానికి అలాంటి సాహిత్యం పరిచయం చేసిన వారి గూర్చి వివరించారు. సమాజంలో అన్ని ప్రభావాల కలయిక వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. ప్రముఖ సాహిత్యకారులు మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా అప్రకటిత సంక్షోభం నడుస్తోందని, ఉద్రిక్తతలు పెరిగిపోతున్నాయని అన్నారు. జాతీయ ఉద్యమ విలువలు కనుమరుగు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు మారుతున్నప్పటికీ మార్పు కోసం కవులు ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ... ఆలోచనలకు పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గోసతో వచ్చిన తెలంగాణను రక్షించుకొందామని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ... భావితరాలకు మంజీర రచయితల సంఘం కరదీపికగా ఉండాలన్నారు. అనంతరం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ మాట్లాడుతూ మరసం నుంచి ఎందరో కవులు, కళాకారులు, రచయితలు, జర్నలిస్టులు వచ్చారని అన్నారు. తెలంగాణ రచయితలసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాలేశ్వరం శంకరం మాట్లాడుతూ. మరసం ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ రచించిన జయహే జయ తెలంగాణ పుస్తకాన్ని, సిద్దంకి యాదగిరి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు మరసం పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత నందిని సిద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, మరసం జిల్లా అధ్యక్షుడు రంగాచారి. జిల్లా టీఎస్జీఓ అధ్యక్షుడు పరమేశ్వర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం, కవులు, రచయితలు, కళాకారులు, జర్నలిస్టులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్సపొందుతూ వృద్ధుడి మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన దొమ్మాట కనకారెడ్డి(60) ఈనెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగాడు. చుట్టుపక్కలవారు గమనించి వ్యవసాయ బావి వద్ద ఉన్న కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వెంటనే చేరుకొని హుటాహుటిన 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆదివారం కనుకారెడ్డి మృతిచెందాడు. అతని కోడలు స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మరో యువకుడు సైతం ..


శివకేశవ్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ సంఘటన నర్సాపూర్‌లో జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చౌటి శివకేశవ్ (23) ఈనెల 27న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గుర్తించి హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆత్మహత్య గల కారణాలు తెలియ రాలేదు. ఈ విషయమై నర్సాపూర్ ఎస్సై లింగంను వివరణ కోరగా శివకేశవ్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు ఇవ్వగానే దర్యాప్తు చేస్తామన్నారు.

దాడి చేసిన వారిపై కేసు

పటాన్‌చెరు టౌన్: విలేకరిపై దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, కట్టేసి కొట్టినందుకు మరో కేసు నమోదైన చేసినట్లు అమీన్‌పూర్ పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఐలాపూర్ గ్రామాన్ని కలిపిన క్రమంలో అక్రమంగా ఇంటి నంబర్లు ఇవ్వడంపై ఒక పత్రిక విలేకరి సంతోశ్‌నాయక్ పంచాయతీ కార్యదర్శి సచిన్‌ను వివరణ అడిగారు. దీంతో శనివారం కార్యదర్శి సచిన్‌తో పిలిపించి, అజీమ్, ముఖీమ్, స్వామి, పలువురు వ్యక్తులు స్తంభానికి కట్టేసి మహిళలతో చెప్పులతో కొట్టించారు. గతంలో రెవెన్యూ అధికారులు అక్రమ లేవుట్ కూల్చిన వార్తను రాసినందుకు ముఖీమ్, అజీమ్‌లు కక్ష పెంచుకొని కార్యదర్శి ద్వారా పిలిపించి హత్యాయత్నం చేశారని సంతోశ్‌నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి విగతజీవిగా..

నిజాంపేట మండలంలో ఘటన


దేవరాజు (ఫైల్)

నిజాంపేట(మెదక్): నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యకిత్ చెరువులో పడి మృతిచెందాడు. ఈ ఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన దేవరాజు (32) సంవత్సరం నుంచి కుటుంబ సమస్యలతో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి సమయంలో బయటికి వెళ్తున్నానని చెప్పిపోయాడు. ఎంతకీ తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతకగా ఆచూకీ లభించలేదు. శనివారం రాత్రి గ్రామ శివారులోని ఏనుకుంట చెరువులో గుర్తు తెలియని మృతదేహం తేలిందని గ్రామస్తులు పోలీసులకు సమాచారం తెలిసింది. ఇక్కడికి చేరుకొని గజఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. ఆపై పరిశీలిస్తే మరణించిన వ్యక్తి దేవరాజ్ అని గుర్తించారు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

పత్తి రైతును ముంచిన వర్షాలు

దెబ్బతిన్న పంటలు
- ఆలస్యంగా చేపట్టిన సాగులో కనిపించని ఎదుగుదల
- మరోవైపు తెగుళ్ల బెడద
- అయోమయంలో రైతులు


ఎదగని పత్తి పంట


భారీ వర్షాలకు పత్తి చేలో నిలిచిన వర్షం నీరు

జహీరాబాద్: జిల్లావ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పత్తి పంట భారీగా దెబ్బతింది. ఈనెల 20 నుంచి వారం రోజులపాటు కురిసిన భారీ వర్షాల వల్ల పత్తి పంట కోలుకోలేని విధంగా పాడైంది. ఈనెల మొదటి, రెండు వారాల్లో సైతం భారీ వర్షాలు కురువడంతో పంట దెబ్బతింది. మధ్యలో పది రోజులపాటు వర్షాలు లేవు. కొంత మేర పత్తి పంట కోలుకుంటున్న దశలో మరోమారు తుపాను విరుచుకపడటంతో ఉన్న కాస్త పంట కూడా వర్షార్పణం అయింది. దీంతో రైతులు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయి.

3.50 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో 3.50 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగైనట్లు అధికార యంత్రాంగం పేర్కొంది. రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. ఇతర పంటలు ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో రైతులు ఈ సాగు వైపు ఆసక్తి చూపారు. అధిక వర్షాల వల్ల పత్తి కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. వర్షం ఎక్కువ అయినా, వర్షాభావం ఉన్నా కొంత మేర పత్తి పంట తట్టుకుంటుందనే ఉద్దేశంతో సాగు చేపట్టారు. తీరా అధిక వర్షాల కారణంగా పంట ఆశించిన మేరకు ఎదగలేదు. జూన్ రెండో వారంలో సాగు చేసిన పంట ఏపుగా పెరిగింది. మొదట్లో వర్షాలు తక్కువగా ఉండటంతో పూత, కాత మెండుగా వచ్చింది. దీంతో రైతులు పంటపై ఆశలు పెట్టుకున్నారు. తీరా జూలై మొదటి వరం నుంచి ఏకంగా నెల రోజుల పాటు భారీ వర్షాలు కురవడంతో పంట బాగా దెబ్బతింది. సుమారుగా 2 లక్షల ఎకరాల్లో సాగైన పంట దిగుబడి సగానికి సగం పడిపోయే పరిస్థితి నెలకొందని రైతులు అంటున్నారు.

భారీగా పెట్టుబడులు

పంట సాగు కోసం రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారు. ఎకరాకు రూ.25 నుంచి రూ.35వేల వరకు ఎరువులు, మందులు, కలుపు తీయడం తదితర వంటి పనులు చేపట్టేందుకు ఖర్చు చేశారు. ఇంకా ఎకరాకు రూ.6 నుంచి 8 వేల వరకు రసాయన మందులను పిచికారీ చేసేందుకు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందంటున్నారు. పెట్టుబడులు పెట్టినా తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. మొదట్లో ఎకరాకు సుమారు 12 వేల క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తాయని ఆశించారు. భారీ వర్షాల వల్ల పంట దెబ్బతినడంతో 6 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడులకే సరిపోతుందంటున్నారు. కౌలు రైతులు మాత్రం చేతి నుంచి కట్టాల్సిన పరిస్థితి ఉంది.

పంట పూర్తిగా దెబ్బతింది



రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టా. అధిక వర్షాల వల్ల పంట దెబ్బతింది. దీంతో పంట దిగుబడులు పూర్తిగా పడిపోయే పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో తోచడం లేదు.

– శ్రీహరిరెడ్డి, రైతు, రంజోల్

ఇంకా పెట్టుబడి పెట్టాలి

పంట సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టా. నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశా. ఎకరాకు రూ.25వేలకు పైగా పెట్టుబడులు పెట్టా. వర్షాలకు దెబ్బతినగా మిగిలిన కొద్ది పంటయినా దక్కించుకోవాలంటే ఇంకా పెట్టుబడి పెట్టాల్సిందే.

– జగన్నాథ్‌రెడ్డి, రైతు, రంజోల్

రోడ్డు దాటుతుండగా కబళించిన మృత్యువు


ఈశ్వరయ్యగౌడ్ (ఫైల్)

మునిపల్లి(అందోల్): బైక్ ఢీకొన్న వ్యక్తి మృతిచెందిన సంఘటన బుదేరా చౌరస్తా సమీపంలో ఆదివారం జరిగింది. బుదేరా ఏఎస్ఐ ఏసయ్య తెలిసిన వివరాల ప్రకారం.. చౌరస్తాలో జోగిపేట ఈశ్వరయ్యగౌడ్ (59), సంగమ్మ కల్లు దుకాణం నడుపుతూ జీవిస్తున్నారు. ఖాళీ సీసాలను తీసుకు రావడానికి 65 నంబర్ జాతీయ దాటుతున్న సమయంలో సదాశివపేట వైపు నుంచి వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య జోగిపేట సంగమ్మ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ ఎసయ్య తెలిపారు.

బైక్, ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన తూప్రాన్– నర్సాపూర్ హైవే చండి గ్రామశివారులో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సంగారెడ్డికి చెందిన సుమన్ తన బైక్‌పై తూప్రాన్ నుంచి సంగారెడ్డి వైపు వస్తుండగా గుర్తుతెలియని ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో అతడి తలకు తీవ్రగాయమైంది. వెంటనే గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

ఏడుపాయలకు నుంచి తిరిగొస్తూ ఒకరికి..


గాయపడిన అమృత్‌రావు

పాపన్నపేట(మెదక్): స్కూటీపై నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని కోడుపాక శివారులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. గాజుల గూడెంకు చెందిన అమృత్‌రావు స్కూటీపై ఏడుపాయలకు వెళ్లి తిరిగొస్తుండగా కోడుపాక శివారులో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా క్షతగాత్రుడికి మెదక్ ఆస్పత్రికి తరలిస్తే వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదారాబాద్‌కు తరలించారు.

బంధువులను బస్ ఎక్కించేందుకు వచ్చి..

బెజ్జంకి(సిద్దిపేట): బైక్‌ను కారు కొట్టిన ఘటనలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన బెజ్జంకిలో జరిగింది. ఎస్ఐ క్రిష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుండారం గ్రామానికి చెందిన నర్సయ్య.. బంధువులను బస్ ఎక్కించేందుకు ద్విచక్ర వాహనంపై బెజ్జంకి క్రాసింగ్‌కు వచ్చాడు. తిరిగి అతను బయలుదేరి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి కరీంనగర్ వైపు వస్తున్న కారు ఢీకొంది. దీంతో అతడి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గమనించి అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా చేరుకుంది. ఇందులో క్షతగాత్రుడిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న నర్సయ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం


కిష్టయ్య


దీపక్‌కుమార్

నారాయణఖేడ్: ఖేడ్ మండల టీపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిష్టయ్య, ఉపాధ్యక్షుడిగా రాజుదాస్, పెంటమ్మ, రవీందర్, మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా దీపక్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా సాయిలు, శ్రీనివాస్, జి.సాయిలు, పర్లాల్, సునీత, జిల్లా కౌన్సిలర్లుగా ఎం.డి ఆదం, సుహాసిని, కిషన్‌రావు, మహేశ్వర్‌రావు, వెంకట్‌రాథోడ్, మమత, విఠల్, రాములు, గోవింద్, శాంతాబాయి, జీఓ కమిటీ కన్వీనర్‌గా పరశురాం, అకాడమిక్ సెల్ కన్వీనర్‌గా కిషన్, సోషల్‌మీడియా కన్వీనర్‌గా లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బాబురావు, పరిశీలకులుగా భాస్కర్ వ్యవహరించారు.

వ్యక్తి అదృశ్యం

తూప్రాన్: మనస్తాపం చెందిన వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మున్సిపల్ పరిధిలోని తాతపాపన్ పల్లిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బిర్లా శ్రీశైలం, లక్ష్మి దంపతులు. ఏడాది క్రితం భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ పడ్డారు. మనస్తాపం చెందిన భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి శ్రీశైలం మద్యానికి బానిసై మనస్తాపంతో తాను కూడా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి..


నరేశ్ మృతదేహం

గజ్వేల్‌రూరల్: చేపలవేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలపరిధిలోని జాలిగామలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మీసాల(జంగిడి) నరేశ్(45), సునీత భార్యాభర్తలు. వారికి ఇద్దరు సంతానం. నరేశ్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. గ్రామంలో ఉన్న పెద్ద చెరువులో చేపలు పట్టేందుకు తోటి గ్రామస్తులతో కలిసి అతను కూడా వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న పోలీసులు అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసత్రికి తరలించి బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


కౌంటర్‌ను పగులగొట్టిన దొంగలు


తాళాలు పగులగొట్టి షెట్టర్ తెరచి..

వైన్స్‌లో చోరీ

- రూ.2.15 లక్షలను ఎత్తుకెళ్లిన దొంగలు
- రూ. 10 వేల విలువైన మద్యం బాటిళ్లు కూడా

హవేళిఘణాపూర్(మెదక్): గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి నగదు, మద్యం ఎత్తుకెళ్లిన సంఘటన మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌లో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ శ్రీ భవాని వైన్స్ యజమాని రోజులాగే ఆరోజు రాత్రి తాళం వేసి ఇంటికి వెళ్లారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు వచ్చి తాళాలు పగులగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ.1.95 లక్షల నగదు, రూ.10 వేల విలువైన మద్యం బాటిళ్లను ఎత్తుకెళ్లినట్లు యజమాని పోలీసులకు ఫిర్యాదులు చేశారు. సీసీ కెమెరాలను సైతం ధ్వంసం చేశారని తెలిపారు. సంఘటన స్థలాన్ని క్లూస్‌టీమ్ బృందం పరిశీలించి ఆధారాలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఏడుగురి ముఠాలో ముగ్గురి అరెస్టు
- పరారీలో నలుగురు
- వివరాలు వెల్లడించిన సీఐ జాన్‌రెడ్డి

నర్సాపూర్ రూరల్: తాళాలు వేసి ఉన్న ఇంట్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఏడుగురు సభ్యులు గల ముఠాలోని ముగ్గురిని అరెస్టు చేసినట్లు నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సై లింగంలు ఆదివారం తెలిపారు. నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నత్నయ్యపల్లి తోపాటు, చిలప్‌చెడ్ పీఎస్ పరిధిలోని ఫైజాబాద్, సంగారెడ్డి జిల్లా జిన్నారం స్టేషన్ పరిధిలోని సొలక్‌పల్లి, దాడిగూడెం గ్రామాల్లో నెల రోజుల నుంచి వరుసగా తాళాలు ఉన్న ఇళ్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడి, బంగారు ఆభరణాలు, దోచుకున్నారు. ఈ మేరకు కేసులో నమోదు చేసుకొని నర్సాపూర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు అనుమానాస్పద వ్యక్తులను పట్టుకొని విచారిస్తే దొంగతనాల విషయం బయటపడింది. సంగారెడ్డి జిల్లా పరిధిలోని ఝరాసంఘం మండలంలో ఉన్న ఓ గిరిజన తండాకు చెందిన ఏడుగురు గ్రూపుగా ఏర్పడి తాళాలు వేసిన ఇళ్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలిందని తెలిపారు. బానోత్ రాములు, రాథోడ్ తారా సింగ్, జై రాములులను అరెస్టు చేసి, వారి నుంచి 12 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు నిందితులైన రమేశ్, విజయ్, రాజు, రవిలను త్వరలోనే పట్టుకుంటామని సీఐ, ఎస్ఐలు తెలిపారు.

ఫిట్స్ వ్యాధి తగ్గడం లేదని..

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

వర్గల్(గజ్వేల్): ఫిట్స్ వ్యాధి తగ్గడం లేదని మనోవేదనతో జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం వర్గల్ మండలం వేలూరులో జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చీమల రాములు (70) కొంతకాలం నుంచి ఫిట్స్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. వ్యాధి తగ్గడం లేదని మనోవేదనకు గురై ఆదివారం తమ పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నకొడుకు నర్సింహులు గమనించి ఇరుగు పొరుగు సాయంతో కిందికి దింపి తూప్రాన్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుమారుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సేల్ డీడ్ ఘటనలో పలువురిపై కేసు

నారాయణఖేడ్: తాత చనిపోయాడని కొంత ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించుకుని, తర్వాత ఆయన చేత మిగతా ఆస్తిని సేల్‌డీడ్ చేయించిన ఘటనపై అత్త సహా పలువురిపై మనవడు ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదైంది. ఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి ఈరప్పకు కొడుకు విఠల్, కూతురు ఈశ్వరి ఉన్నారు. విఠల్, లింగమ్మ దంపతులకు కుమారుడు సంతోశ్ ఉన్నాడు. 2010లో విఠల్, అతడి భార్య లింగమ్మ 2021లో చనిపోయారు. ఈరప్ప పేరిట గంగాపూర్ శివారులోని వివిధ సర్వే నంబర్లలో 2 ఎకరాల భూమి ఉంది. తండ్రి బతికి ఉండగానే ఈశ్వరి గ్రామానికి చెందిన పరమేశ్వర్, సాయన్న, గంగారాం, శంకర్‌లతో కలిసి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కైంది. 2017లో ఈరప్ప మృతిచెందాడని చెప్పి.. మరణ ధ్రువీకరణ పత్రం లేకుండానే అతని వారసురాలు తనేనంటూ వారసత్వ పంచనామాతో 0.08 ఎకరాల భూమిని 2020 ఆగస్టు 29న ఫౌతిపట్టా మార్పిడి చేయించుకుంది. ఆ అధికారులతోనే ఈరప్పతో మిగతా భూమిని సైతం 2021 మార్చి 30న సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయించారు. తండ్రి జీవించి ఉన్నా చనిపోయాడని కొంతభూమిని, మిగతాది సైతం ఆయనతోనే భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయమై మనవడు సంతోశ్.. తాత భూమికి తాను వారసుడి అని, ఆయన బతికి ఉండగానే చనిపోయాడని కొంతభూమిని, మిగతా భూమిని ఆయన చేతే రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదు మేరకు ఈశ్వరి, పరమేశ్వర్, సాయన్న, గంగరాం, శంకర్ తోపాటు మరికొందరు రెవెన్యూ అధికారులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇదేం చోద్యం ‘మల్లన్నా’..

- మహిళా సేవా సమితి సభ్యులచే లడ్డూల ప్రసాద ప్యాకింగ్


లడ్డూ ప్యాకింగ్ చేస్తున్న మహిళా సేవాసమితి సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయంలో లడ్డూల తయారీ, ప్యాకింగ్.. మహిళా సేవా సమితి సభ్యులతో చేయించడం చర్చకు దారితీసింది. ప్రత్యేక సిబ్బందితో చేయించాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ ఉచిత సేవకు వచ్చే భక్తులను ఇలా వినియోగించుకుంటండటం గమనార్హం. ఆదివారం కొందరు భక్తులు, స్థానికులు ఆలయ ఏఈవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయగా తమపట్ల దురుసుగా ప్రవర్తిస్తూ కాంట్రాక్టర్‌కు వత్తాసు పలికారని వారు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై ఈఓ బాలాజీని వివరణ కోరగా విషయం ఇప్పుడే తమ దృష్టికి వచ్చిందని వెంటనే కాంట్రాక్టర్ సంబంధిత అధికారులను మందలించినట్లు తెలిపారు. ఆలయ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వారి టెండర్ రద్దు చేయనున్నట్లు హెచ్చరించారు.

అల్గోల్ రోడ్డుకు మరమ్మతులు

జహీరాబాద్ టౌన్: గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైన అల్గోల్–జహీరాబాద్ రోడ్డుకు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఈ నెల 16న అల్గోల్ గ్రామ ఆటోడ్రైవర్లు రాస్తారోకో నిర్వహించారు. జహీరాబాద్ పట్టణం నుంచి అల్గోల్ గ్రామం సుమారు పది కిలో మీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డు పై గుంతలు పడి వాహనాలు అదుపు తప్పి పడిపోతున్నాయి. ఆటోలు ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. స్పందించిన సెట్విన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గిరిధర్‌రెడ్డి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు పనులు ప్రారంభమైన పనులను ఆయన ఆదివారం పరిశీలించారు.

అవగాహన లోపం.. అధిగమిస్తే సువర్ణావకాశం

డిగ్రీ పూర్తి కాగానే ఉద్యోగ అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం జాబ్ గ్యారంటీ కోర్సులను ప్రవేశపెట్టింది. ఉమ్మడి జిల్లాలోని మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచే అమలవుతోంది. ఇందులో చేరితే ఉద్యోగ అవకాశం కచ్చితంగా లభిస్తుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కానీ కొత్త కోర్సు కావడం రీత్యా ఆసక్తి చూపించడం లేదని తెలుస్తోంది.

మెదక్ డిగ్రీ కాలేజీలో బీబీఏ లాజిస్టిక్స్ కోర్సు
- థర్డ్ ఇయర్ నుంచే ఉద్యోగావకాశాలు
- అవగాహన కల్పించినా ఆసక్తి కనబరచని విద్యార్థులు



ప్రభుత్వ డిగ్రీకాళాశాల మెదక్

మెదక్‌జోన్: మెదక్ డిగ్రీ కాలేజీల్లో 14 రకాల వివిధ కోర్సులు ఉండగా 1,700 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో డిగ్రీ పూర్తి చేసిన వారు వెంటనే ఉద్యోగం వచ్చేలా ప్రభుత్వం డిగ్రీలో కొత్తగా పలు రకాల జ్యాబ్ గ్యారంటీ కోర్సులను చేర్చింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో ఉమ్మడి మెదక్ జిల్లాలోని 3 జిల్లాలకు కొత్త కోర్సు మంజూరు చేసింది. మెదక్‌లో మాత్రం చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు.

వచ్చే ఏడాది నుంచి చేరేలా కృషి



మెదక్ డిగ్రీ కాలేజీకి బీబీఏ లాజిస్టిక్స్ కొత్త కోర్సు మంజూరైంది. ఇందులో ఇద్దరే చేరారు. తర్వాత వారూ విరమించుకున్నారు. ఈ కోర్సుపై మరింత అవగాహన కల్పించి వచ్చే ఏడాది నుంచి అయినా విద్యార్థులు చేరేలా కృషి చేస్తాం.

– హుస్సేన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మెదక్

మెదక్‌కు బీబీఏ లాజిస్టిక్స్ కోర్స్

ఉద్యోగ భరోసా కల్పించే కోర్సులో భాగంగా 2024–25కి గాను మెదక్ జిల్లా డిగ్రీ కాలేజీకి బ్యాచ్‌లర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) లాజిస్టిక్స్ కోర్సు ప్రవేశపెట్టింది. ఇందులో రెండేళ్లు పూర్తి చేసుకొని మూడో యేటా ఇంటర్న్‌సిప్ చేస్తుండగానే క్యాంపస్‌కు కంపెనీలు వచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని పట్టణంలోని బాయ్స్ జూనియర్ కాలేజీతో పాటు జిల్లాలోని 16 ప్రభుత్వ కాలేజీల్లో అధికారులు అవగాహన కల్పించారు. థర్డ్ ఇయర్ పూర్తి కాగానే సదరు విద్యార్థి అనుభవం గడిస్తారు. దీంతో ఉన్నత ఉద్యోగం పొందొచ్చు అని తెలిపినా ముందుకు రాలేదు. కొత్త కోర్సు కావటంతో డిగ్రీ కాలేజీలో ఏ ఒక్కరు కూడా చేరేందుకు ఆసక్తిని చూపలేదని చెబుతున్నారు.